# దుర్గుణాలను త్యజించి ప్రేమను పెంచుకోండి

**మానవునికి అహంకార, ఆడంబరములున్నంతవరకు అతనిని ఎవ్వరూ ప్రేమించరు. క్రోధమున్నంతవరకు అతనికి శోకము తప్పదు. కోరికలున్నంతవరకు సిరిసంపదలు అతనివైపుకే చూడవు. లోభమున్నంతవరకు అతనికి శాంతి లేదు.**

***ప్రేమస్వరూపులారా!*** ఈ జగత్తునందు సమస్త పదార్థములూ సత్, చిత్, ఆనందము, రూప, నామములనే ఐదింటితోకూడియున్నవి. సత్, చిత్, ఆనందములే మానవుని ప్రధానమైన గుణములు. రూప నామములు కల్పితములు. కాని, మానవుడు తన నిజస్వరూపాన్ని విస్మరించి, రూపనామములనే ఆధారం చేసుకొని జీవిస్తున్నాడు; తన దివ్యత్వాన్ని మరచిపోవడంచేత దానవునివలె ప్రవర్తిస్తున్నాడు. భగవంతుడు గుణాతీతుడు, భావాతీతుడు. అట్టి భగవంతునికి మానవుడు అనేక గుణములు కల్పిస్తున్నాడు. ఇది నిజంగా చాలా విచిత్రమైన విషయం. భగవంతునియందు ఎంతటి సత్యధర్మములు, ఎంతటి దయా ప్రేమలున్నవో ప్రతి మానవుడు గుర్తించవలసిన అవసరమున్నది.

భగవంతుడు సమస్త శక్తిని నాభియందు ఉంచుకోవడంచేత అతనికి హిరణ్యగర్భుడని పేరు. హిరణ్యగర్భతత్త్వము ఉత్కృష్టమైనది, సౌజన్య మైనది, సౌశీల్యమైనది. ఉత్తేజకరమైన తేజస్సుతో ప్రకాశించేవాడు కనుక, అతనికి తేజోమయుడని, సౌందర్యవంతుడనికూడా పేర్లున్నాయి. సమస్త సృష్టికీ అతడే కారకుడు కనుక, అతనికి ప్రజాపతి అని మరొక పేరు. భగవంతునియొక్క తత్త్వమును అర్థము చేసుకొనవలెనన్న ఒక్కొక్క నామము ఏవిధమైన భావముచేత ఆవిర్భవించిందోగుర్తించాలి. భగవంతునికి ఎన్నో పేర్లున్నవి. అర్థరహితమైన పేరు ఒక్కటీ లేదు. దీనిని పురస్కరించుకొనియే మన ప్రాచీనులు తమ పిల్లలకు భగవంతుని పేర్లు పెడుతూ వచ్చారు.

ప్రతి మానవునియందు దక్షత, దీక్ష రెండూ ఉన్నాయి. భగవంతుణ్ణి దర్శించాలనే పవిత్రమైన దీక్షను పూనినవాడే నిజమైన మానవుడని చెప్పవచ్చును. దైవత్వము ఎక్కడున్నదో తెలుసుకోవాలని మానవుడు అనేక ప్రయత్నములు చేస్తున్నాడు. తనయందే ఉన్న భగవంతుణ్ణి వెతకడ మెందుకు? భగవంతుడు ప్రేమస్వరూపుడు. సత్యమే అతని స్వభావము. "సత్యాన్నాస్తి పరో ధర్మః" సత్యమును మించిన ధర్మము మరొకటి లేదు. కాని, మానవుడీ సత్యమును గుర్తించుకోలేక, తన అభీష్టములను నెరవేర్చుకునే నిమిత్తం అసత్యమును సత్యముగా భావించి దానినే పోషిస్తూ వస్తున్నాడు. మానవుడు మొట్టమొదట తన నిజస్వరూపాన్ని గుర్తించడానికి ప్రయత్నించాలి. 'సత్యం జ్ఞానం అనంతం' – ఇదే మానవుని నిజస్వరూపం. తన నిజస్వరూపాన్ని గుర్తించుకోలేని మానవునికి కన్నులు తెరిపించే నిమిత్తం వేదశాస్త్రేతిహాస పురాణములు అందించబడినాయి. ప్రతి మానవునియందు సత్యమున్నది, ధర్మమున్నది, ప్రేమ ఉన్నది. సత్, చిత్, ఆనందములే మానవుని ప్రధానమైన గుణములు. 'సత్' అనగా శాశ్వతమైనది. అది ఏనాటికీ మార్పుచెందదు. 'చిత్' అనగా చైతన్యము.

మానవునియందున్న చైతన్యము దైవస్వరూపమే. అట్టి చైతన్యతత్త్వాన్ని గుర్తించినవాడే నిజమైన మానవుడు. సత్ చిత్ ఆనందమని చెప్పినా, సత్యం జ్ఞానమనంతమని చెప్పినా పదములు వేర్వేరుగాని అర్థం ఒక్కటే.

ఈ ప్రపంచములో ద్వైతవాదమని, అద్వైతవాదమని, విశిష్టాద్వైత వాదమని అనేకరకములైన వాదములనుగురించి మనం వింటున్నాము. వీటన్నింటియొక్క సారము కేశవనామమే. 'క' అనగా బ్రహ్మ, 'ఈశ' అనగా శివుడు, 'వ' అనగా విష్ణువు. కాబట్టి, కేశవతత్త్వమే సృష్టి, స్థితి, లయములకు కారణమైనటువంటిది. మానవుడు తన తత్త్వమును తాను గుర్తించు కోవాలంటే కేశవనామమును తనయందు నిలుపుకోవాలి.

**సకల మతముల సారం ఒక్కటే**

ప్రాచీన కాలములో ఋషులు దైవత్వమును గుర్తించాలని అనేక పరిశీలనలు, పరిశోధనలు చేసి, "వేదాహమేతం పురుషం మహాన్తం ఆదిత్య వర్ణం తమసః పరస్తాత్" అని జగత్తుకు చాటుతూ వచ్చారు. వేదాతీతమైన తత్త్వము దైవత్వము. భగవంతుడు అజ్ఞానమనే తమస్సుకు ఆవల కోటిసూర్యుల కాంతితో ప్రకాశిస్తున్నాడు. అట్టి పవిత్రమైన దైవస్వరూపాన్ని దర్శించవలసిందిగా ప్రాచీన ఋషులు ఉద్బోధించారు.

**అల్లాయంచు మహమ్మదీయులు జహోవాయంచు సత్క్రైస్తవుల్**
**పుల్లాబ్జాక్షుడటంచు వైష్ణవులు శంభుండంచు శైవుల్ సదా**
**ఉల్లాసంబున గొల్వనెల్లరకు నాయుర్భోగభాగ్యాది సం**
**పల్లాభంబులొసంగి బ్రోచు నొకడే భవ్యుండు భావింపుడీ!**

దైవము ఒక్కడే, పేర్లు అనేకంగా ఉంటున్నాయి. ఈనాడు ఒక్కొక్క పేరుతో ఒక్కొక్క మతాన్ని స్థాపిస్తూ వచ్చారుగాని, అన్ని మతముల సారము ఒక్కటే.

**మతములన్నియు వేరు, మార్గంబు ఒక్కటె**
**వస్త్రభేదము వేరు, దారమొకటె**
**శృంగారములు వేరు, బంగారమొక్కటె**
**పసుల వన్నెలు వేరు, పాలు ఒకటె**
**జీవజంతులు వేరు, జీవుండు ఒక్కటె**
**కులములన్నియు వేరు, పుటుక ఒకటె**
**దర్శనంబులు వేరు, దైవమ్ము ఒక్కటె**
**పూలవన్నెలు వేరు, పూజ ఒకటె**
**తెలియలేకను మానవుల్ తెలివి తప్పి**
**బ్రతుకుకోసము బహుబంధ బద్ధులైరి**
**ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపఱతు?**
**సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!**

మానవుడు తన తత్త్వాన్ని తాను గుర్తించుకున్నప్పుడు ఇట్టి సత్యము స్ఫురణకు వస్తుంది. కాని, మానవునియందు క్రమక్రమేణ దైవము పట్ల నమ్మకం సన్నగిల్లుచున్నది. అపనమ్మకమువలన తాను అనేక అనర్థాలకు గురి అవుతున్నాడు.

**'పువ్వు పుట్టగనే పరిమళించినట్లు"**

జీసస్ I am the son of God (నేను దేవుని కుమారుడను) అని చెప్పాడు. అంతేగాని, 'నేనే దైవమ'ని ఎప్పుడూ చెప్పుకోలేదు. అతను జన్మించిన సమయంలో ముగ్గురు జ్ఞానులకు ఒక గొప్ప కాంతిమంతమైన నక్షత్రం

కనిపించగా, అదెక్కడికి వెళుతుందో చూద్దామని వాళ్ళు దానిని అనుసరిస్తూ వెళ్ళారు. ఆ నక్షత్రం వాళ్ళను జీసస్ జన్మస్థానానికి తీసుకువెళ్ళింది. అక్కడ ఒక చిన్నతొట్టిలో దివ్యకాంతితో తేజరిల్లుతున్న శిశువును చూసి వాళ్ళెంతో ఆనందించారు. మొదటివ్యక్తి 'ఈ పిల్లవాడు భగవంతుణ్ణి ప్రేమిస్తాడు' అన్నాడు. రెండవవ్యక్తి 'భగవంతుడే ఈ పిల్లవానిని ప్రేమిస్తాడు', అన్నాడు. మూడవ వ్యక్తి, 'ఇతడు భగవంతునివలె అందరినీ ప్రేమిస్తాడు. ఇతనికి, భగవంతునికి భేదము లేదు', అన్నాడు. భగవంతుణ్ణి ప్రేమించేవాడు Messenger of God (భగవంతుని దూత). భగవంతునిచేత ప్రేమింపబడేవాడు Son of God (భగవంతుని కుమారుడు). అందరిలో ఉన్న ఏకత్వాన్ని గుర్తించిన వాడు తానే దైవంగా రూపొందుతాడు. బైబిల్‌లో ఉన్న వాక్యముల అంతరార్థమిదే! The one you think you are (నీ దృష్టిలో నీవు) The one others think you are (ఇతరుల దృష్టిలో నీవు). The one you really are (నిజమైన నీవు). ఈ మూడింటియొక్క సరియైన అర్థమును మీరు గుర్తించాలి.

ఒక పర్యాయం జెరూసలెంలో ఒక గొప్ప తిరునాళ్ళు జరిగింది. జనులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. జీసస్‌ను వెంటపెట్టుకొని అతని తల్లిదండ్రులు కూడా వెళ్ళారు. జీసస్ ఆ జనసమూహంలో ఉన్నట్లుండి తల్లిదండ్రులకు కనిపించకుండా ఎటో వెళ్ళిపోయాడు. తల్లిదండ్రులు అన్నివైపుల వెతికారు. తమ బిడ్డ ఎక్కడా కనిపించక పోయేసరికి చాలా ఆందోళన చెందారు. అసలు జరిగిందేమిటంటే, అక్కడి దేవాలయములో పురోహితుడు భగవద్విషయాలు చెబుతుంటే జీసస్ వెళ్ళి అక్కడ కూర్చున్నాడు. ఈవిషయం తెలియక తల్లి మేరీ చాలా బాధపడుతూ వచ్చింది. కన్నతల్లికి అది సహజమే కదా! సరే, భగవంతుణ్ణి ప్రార్థిద్దామని దేవాలయానికి వెళ్ళింది. తలుపు దగ్గరికి వెళ్ళేసరికి అక్కడ జీసస్ కనిపించాడు. ఆమె పట్టలేని ఆనందముతో తన బిడ్డను ఎత్తుకొని, "నాయనా! ఇంతసేపు ఎక్కడికి పోతివి? నాకు కనిపించలేదే! ఎక్కడ ఉంటివి?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. అప్పుడా పిల్లవాడు, "అమ్మా! ఎందుకు నీకింత భయం? నేను దేవునిదగ్గరనే ఉన్నాను కదా! దేవాలయములో పురోహితుడు చక్కని బోధలు చేస్తుంటే వింటూ కూర్చున్నాను", అని చెప్పాడు. ఈరీతిగా, బాల్యంనుండియే జీసస్‌లో దైవచింతన ప్రారంభమైంది.

**జాలర్లకు జీసస్‌పట్ల నమ్మకం కల్గడం**

జీసస్ తండ్రి జోసెఫ్ వృత్తిరీత్యా వడ్రంగి. కొంతకాలమునకు ఆయన మరణించాడు. ఉదర పోషణార్థం తండ్రియొక్క వృత్తిని కొనసాగించ వలసిందిగా తల్లి చెప్పింది. కాని, జీసస్ ఆ పనికి ఇష్టపడలేదు. బిడ్డయొక్క ఇష్టమునకు విరుద్ధంగా పోవడం తల్లికి ఇష్టం లేదు. ఒకనాడు జీసస్ తల్లికి చెప్పకుండా ఒక పర్వతముపైకి వెళ్ళి భగవచ్చింతన చేస్తూ కూర్చున్నాడు. కొంతకాలం తరువాత క్రిందికి దిగివచ్చాడు. అక్కడ సముద్రపుటొడ్డున కొందరు జాలర్లు విచారవదనులై కూర్చొని ఉన్నారు. జీసస్ వాళ్ళవద్దకు వెళ్ళి, "ఎందుకింత విచారంగా ఉన్నారు?" అని ప్రశ్నించాడు. "నాయనా! మేము ఎంతో కాలమునుండి చేపల వ్యాపారము చేస్తూ మా జీవనం సాగిస్తున్నాము. కాని, ఈనాడు మాకు ఎంత ప్రయత్నించినా ఒక్క చేపకూడా చిక్కలేదు" అని వాళ్ళు సమాధానమిచ్చారు. జీసస్ చిరునవ్వుతో, 'జల మున్నచోట చేపలుండకుండాఎక్కడికిపోతాయి? నావెంట రండి. ఈ పడవనెక్కి వెళదాం', అని వాళ్ళను తనవెంట తీసుకువెళ్ళాడు. సముద్రంలో కొంతదూరం వెళ్ళిన తరువాత, 'ఇక్కడ వల వేయండి', అన్నాడు. వాళ్ళు వల విసిరేసరికి దండిగా చేపలు చిక్కాయి. అప్పుడా జాలర్లకు జీసస్‌పై గట్టి నమ్మకం ఏర్పడింది.

మానవునికి నమ్మకం చాలా ప్రధానమైనది. నమ్మకమెక్కడో ప్రేమ అక్కడ. ప్రేమ ఎక్కడో శాంతమక్కడ.

శాంతమెక్కడో సత్యమక్కడ. సత్య మెక్కడో ఆనందమక్కడ. ఆనందమెక్కడో దైవమక్కడ. జీసస్ ఆ జాలర్లలో నమ్మకాన్ని కల్గించాడు. వారిలో ప్రధానమైనవాడు పీటర్. అతనిలో జీసస్‌పట్ల అమితమైన ప్రేమ, నమ్మకము ఆవిర్భవించాయి. ఆ జాలర్లు నిత్యం జీసస్‌ను పడవలో తమతోపాటు తీసికొని వెళ్ళేవారు. సాయంకాలం తిరిగివచ్చిన తరువాత జీసస్ వాళ్ళనందరినీ ఒక చెట్టుక్రింద కూర్చో బెట్టుకొని ఆధ్యాత్మికప్రబోధలు సల్పేవాడు. ఈరీతిగా, జీసస్‌యొక్క సాహచర్యంలో ఆ జాలర్లు ఆనందంగా కాలం గడుపుతూ వచ్చారు. వారివద్దకు మేథ్యూ అనే “ట్యాక్సు కలెక్టరు” సుంకం వసూలు చేయడానికి వచ్చేవాడు. అతనుకూడా జీసస్ శిష్యునిగా మారిపోయి, నిత్యం జీసస్ గావించే సద్బోధలను ఒక పుస్తకంలో వ్రాసుకుంటూ వచ్చాడు.

ఒకనాడు పీటర్ తండ్రి మరణించాడు. అతని తల్లి దుఃఖముతో కుమిలిపోతుంటే జీసస్ ఆమెను ఓదార్చుతూ, “అమ్మా! ఎందుకు నీవు దుఃఖిస్తున్నావు? మరణమనేది మనము ఒక వస్త్రమును విడిచి మరొక వస్త్రమును ధరించడం లాంటిది. Death is the dress of life. పాంచభౌతికమైన దేహములు వస్తుంటాయి, పోతుంటాయి. వీటిగురించి విచారించకూడదు. ఈ దేహమునందున్న దేహియే నిజమైన దేవుడు”, అని బోధించాడు.

**దేహము పాంచభౌతికము దేహము**
**కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ**
**దేహికి చావుపుట్టుకల్**
**మోహనిబంధ బంధనల ముద్రలు లేవు**
**నిజంబు జూడ యా**
**దేహియె దేవదేవుడు మదిన్**
**గణుతింపగ ఆత్మరూపుడౌ!**

పాంచభౌతికమైన దేహమును ధరించిన తరువాత ఎవరికైనా కష్టాలు తప్పవు. ఈ జగత్తునందు అవి లేకుండా మానవుడు జీవించలేడు. పుట్టిన మానవుడు గిట్టక తప్పదు. అదేవిధంగా, సుఖమనేది ఉన్న తరువాత దుఃఖముకూడా తప్పదు. Pleasure is an interval between two pains. “సుఖదుఃఖే సమేకృత్వా లాభా లాభౌ జయాజయౌ”. సుఖ దుఃఖములను, జయాపజయములను, లాభనష్టములను, సమత్వంతో స్వీకరించాలి. మానవ జీవితం సత్యాన్వేషణ నిమిత్తం ఏర్పడినదేగాని, కేవలం తిని, తిరగడంకోసం కాదు. మానవుడు తన సత్యాన్ని గుర్తించాలి, తన నిజస్వరూపాన్ని అర్థం చేసుకోవాలి. ఈవిధమైన సద్బోధలు సల్పుతూ వచ్చాడు జీసస్. క్రమక్రమేణ అతని పేరుప్రఖ్యాతులు అభివృద్ధిచెందుతూ వచ్చాయి. ఈ లోకంలో ఎవరికైనా మంచిపేరు వస్తున్నదంటే ఓర్వలేనివారు అనేకమంది ఉంటారు. దుర్మార్గులు అసూయచేత మంచివారిని ద్వేషిస్తుంటారు. అసూయ,అహంకారం, ఆడంబరంలాంటి దుర్గుణాలు ఎంతటివారినైనా హతమారుస్తాయి. ఇలాంటి దుర్గుణములుగలవారిని ఎవ్వరూ క్షమించరు. ఎవ్వరినీ దూషించకూడదు, పరిహసించ కూడదు. పవిత్రమైన సమత్వమును అలవర్చుకున్నప్పుడే మానవునిలో మానవత్వము వికసిస్తుంది.

**దుర్గుణాలను దూరం చేసుకోండి**

నేటి మానవుడు మానవతాగుణములను కోల్పోవడంచేత పడరాని బాధలకు గురి అవుతున్నాడు. దహనశక్తి లేనిది ఎట్లు అగ్ని కాజాలదో అట్లే మానవతా గుణములు లేనివాడు మానవుడు కాజాలడు. అలాంటివాడు ఎంతటి ధనవంతుడైనా, ఎంతటి గొప్ప విద్యావంతుడైనా మసిబొగ్గుతో సమానం. అసూయ, క్రోధము, ద్వేషము ఇత్యాది

దుర్గుణాలను దూరం చేసుకోవాలి. ఈనాడు వార్షికోత్సవం జరుపుకుంటున్న 'మెస్సెంజర్స్ ఆఫ్ సత్యసాయి' (అనంతపురం క్యాంపస్ పూర్వవిద్యార్థినుల సేవాసంస్థ)కు నేనిచ్చే సందేశమిదే! ఈ సంస్థసభ్యులు విదేశాల్లోకూడా అనేకమంది పని చేస్తున్నారు. వాళ్ళు ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు. అమెరికా, ఫిలిప్పీన్స్‌లనుండి వచ్చిన అమ్మాయిలు చేసిన ప్రసంగాలను కొద్దిసేపటి క్రిందట మీరు విన్నారు కదా! వారి భావములు, భాష ఎంత మధురంగా ఉన్నాయి! వాళ్ళందరూ ఎంతో గొప్ప విద్యావంతులు. ఫిలిప్పీన్స్‌నుండి వచ్చిన అమ్మాయి పి.హెచ్‌డి. పట్టా పొందింది. ఇలాంటి గొప్ప చదువులు చదివినప్పటికీ వాళ్ళలో వినయ, విధేయతలున్నాయి; భక్తిప్రపత్తులున్నాయి.

విద్యతోపాటు వినయమును మీరు పెంచుకోవాలి, దుర్గుణాలను చంపుకోవాలి. దుర్మార్గము, దుర్బుద్ధులను వీడకపోతే ఎన్ని చదువులు చదివినప్పటికీ ఏమి ప్రయోజనం? మంచివారిని చూసి అసూయ పడడం, వీరిపైన వారికి, వారిపైన వీరికి తంటాలు చెప్పడం... ఇలాంటి దుర్భావాలను చూస్తే నాకు చాలా అసహ్యమనిపిస్తుంది. ఎంతో ప్రేమతో, పవిత్రమైన భావముతో స్వామిపేరుతో సేవా సంస్థలు ప్రారంభిస్తున్నారు. సేవాసమితులు, భజనమండలులను పెట్టుకుంటున్నారు, 'సోషల్ వర్క్' చేస్తున్నారు. కాని, మీ హృదయంలో ప్రేమతత్త్వం లేకపోతే ఏమి ప్రయోజనం? Love is God. Live in Love. ప్రేమతత్త్వాన్ని పెంచుకోవాలి. నాకు పని ప్రధానం కాదు, గుణమే చాలా ప్రధానం. కనుక, మీ బుద్ధులు పెడమార్గం పట్టకుండా చూసుకోండి. మీరు ఎక్కడున్నప్పటికీ, ఏ పని చేస్తున్నప్పటికీ మీ గుణములు పవిత్రంగా ఉండాలి. అసూయ చాలా చెడ్డది. Jealousy is living death. అసూయాపరుడు జీవచ్ఛవముతో సమానం.

**'సత్యసాయి' అనే పేరుకు తగిన గౌరవమివ్వాలి**

కొంతమంది ఇక్కడి మాటలు అక్కడ, అక్కడి మాటలు ఇక్కడ చెబుతుంటారు. ఇతరుల మాటలు మీకెందుకు? ఇతరులను మీరెందుకు దూషించడం? మీలో ఉన్న దుర్గుణాలను దూషించుకోండి, దుర్భావాలను తీసిపారవెయ్యండి. పరులయందు లేని దుర్గుణాలను పుట్టించి ప్రచారం చేయడమెందుకు? ఎన్నివిధములుగా చెప్పినా కొంతమందిలో మార్పు కనిపించడం లేదు. ఈర్ష్య, ద్వేషము... ఇలాంటి దుర్బుద్ధులున్నవారు ఉండి ప్రయోజనమేమిటి? వారివలన ఇతరులుకూడా చెడిపోతారు. ఇలాంటి దుర్గుణాలు గలవారిని నేను ఏమాత్రము చూడను. మీకు ఏమి కావలసినా నేనిస్తాను. అవసరమైతే ప్రాణమైనా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. కాని, మొట్టమొదట దుర్గుణాలను దూరం చేసుకోండి. దైవసంస్థలని పేరు పెట్టుకొని దానవకర్మలు ఆచరించడం మంచిది కాదు. ఏ సంస్థ అయినా సరే, స్వామిపేరు పెట్టుకున్నప్పుడు సత్యమార్గము ననుసరించాలి. 'సత్యసాయి' అనే పేరుకు తగిన గౌరవమివ్వాలి. 'సత్యసాయి' అని పేరు పెట్టుకొని సత్యమును పలుకకపోతే ప్రయోజనమేమిటి? సత్యధర్మాలను అనుసరిస్తూ ప్రేమతో పోషించినప్పుడు సంస్థలు ఎంతైనా అభివృద్ధి చెందుతాయి. "సత్యధర్మపరాయణాయ నమః సత్యస్వరూపాయ నమః ప్రేమస్వరూపాయ నమః..." అని మీరు భగవంతుణ్ణి పూజిస్తున్నారు కదా! ఈ పేర్లలో ఎంత గొప్ప అర్థమున్నది! ప్రేమయే మానవుని ప్రధానమైన తత్త్వము. ప్రేమలేకపోతే మానవునిగా పుట్టి ప్రయోజనమేమిటి?

ఈ ఆధునికయుగంలో చదువులు పెరిగిన కొలదీ దుర్గుణములు కూడా పెరిగిపోతున్నాయి. "చదువులన్నియు *చదివి చావంగ నేటికి? చావు లేని చదువు చదువవలయు"*. చదువులు కాదు మనకు ముఖ్యము. గుణములే చాలా ప్రధానము. "త్యజ దుర్జన సంసర్గం". చెడ్డవారితో స్నేహము చేయడంవలన మనముకూడా చెడ్డవారమై పోతాము. మహాభారతంలో కర్ణుడు చాలా గొప్పవాడు; సకల విద్యలలో ఆరితేరినవాడు; విలువిద్యలో అర్జునునికంటే మించిన ప్రావీణ్యం గలవాడు. కాని, దుర్యోధన, దుశ్శాసనాదుల సంపర్కము చేత అతని పేరు

చెడిపోయింది. "భుజబలము గొప్ప బుద్ధిబల ముండియు దైవబలము లేనిచో దాసుడగును. కర్ణుడంతటి వాడు కడపటికేమయ్యె?" కనుక, మీరు దుస్సంగమునకు దూరంగా ఉండండి.

**మీరు గొప్పవారు కానక్కర్లేదు, మంచివారు కండి**

విద్యార్థులారా! విద్యార్థినులారా! ధనముకంటే గుణము ప్రధాన మైనదని గుర్తించండి.

**ధనమెచ్చిన మదమెచ్చును**
**మదమెచ్చిన దుర్గుణంబు మానక హెచ్చున్**
**ధనముడిగిన మదముడుగును**
**మదముడిగిన దుర్గుణంబు మానును వేమా!**

ధనసంపాదనలో గొప్పతనం లేదు. గుణసంపాదన అత్యవసరం. మితంగా మాట్లాడండి. అమితంగా మాట్లాడారంటే అనవసరమైన మాటలన్నీ వస్తుంటాయి. హృదయంలో విషం నింపుకొని తీయని మాటలు మాట్లాడితే ఏమి ప్రయోజనం? మొట్టమొదట హృదయంలో తీయదనాన్ని నింపుకోవాలి. మీరు దయామయులు కావాలి, ప్రేమ హృదయులు కావాలి. అప్పుడే మీరు నిజమైన మానవులనిపించుకుంటారు. జీసస్ ప్రేమ హృదయుడై అనేకమంది బీద సాదలను సంరక్షిస్తూ వారికి తోడునీడగా ఉంటూ వచ్చాడు. ఎవరైనా సరే, మంచివారికి సహాయం చేయాలి. మనకెన్ని కష్టములు సంభవించినా ఫరవాలేదు. ఎవ్వరినీ దూషించకూడదు. ఇతరులను దూషిస్తున్నామని మీరు భావిస్తున్నారు. కాదు, కాదు. మిమ్మల్ని మీరే దూషించుకుంటున్నారు. ఎందుకంటే, అందరియందున్నది ఒకే ఆత్మ. మీకిష్టం లేకపోతే మౌనంగా ఉండండి. అంతేగాని, పరులను దూషించకండి. మంచి గుణములను పెంచుకోండి. చెడ్డగుణములను పెంచుకుంటూ మంచిపనులు ఎన్ని చేసినప్పటికీ ప్రయోజన ముండదు. మంచిపనులు చేయడానికి మీకు చేతగాకపోతే కనీసం మంచిమాటలైనా పలకండి. You cannot always oblige, but you can speak always obligingly. ఇతరులపై లేనిపోని దోషములు కల్పించి ప్రచారం చేయడం రాక్షసత్వం. కష్టాలలో ఉన్నవారికి తగిన సహాయం చేయండి. ఈనాడు వాళ్ళకి వచ్చిన కష్టం రేపు మీకుకూడా రావచ్చు. ఎవరికైనా బాధలు తప్పవు. కనుక, "లోకాస్సమస్తాః సుఖినో భవంతు", అని అందరి క్షేమంకోసం ప్రార్థించాలి. మీ హృదయము హిరణ్యగర్భముగా మారాలి. అప్పుడే మీకు మంచిపేరు వస్తుంది. మీరు గొప్పవారు కానక్కర్లేదు, మంచివారనిపించుకోవాలి. అందరి ప్రేమకు మీరు పాత్రులు కావాలి. భగవంతుణ్ణి అందరూ ప్రేమిస్తారు. ఎందుకంటే, భగవంతుడు అందరినీ ప్రేమిస్తాడు; ఎవ్వరినీ ద్వేషించడు; ఏది చేసినా మీ మంచికోసమే చేస్తాడు. మీరుకూడా అట్టి ప్రేమతత్త్వాన్ని పెంచుకోండి. సత్యమార్గాన్ని అనుసరించండి. నీతినిజాయతీలను నిలుపుకోండి. "నీతి లేని జాతి నిష్ఫలంబు". మీలో కేవలం దేశభక్తి ఉన్నంతమాత్రాన సరిపోదు, నీతి నిజాయతీలుకూడా ఉండాలి.

ప్రేమస్వరూపులారా! మీరు మాటలు తీయగా మాట్లాడినంతమాత్రాన భగవంతుడు సంతోషించడు. ఆ మాటలను ఆచరణలోపెట్టండి. మీరు 'ప్లాట్‌ఫామ్ స్పీచ్'లు ఇవ్వడంలో హీరోలుగా ఉండి, 'ప్రాక్టికల్ లైఫ్'లో జీరోలుగా ఉంటే ఏమి ప్రయోజనం? 'ప్రాక్టికల్ లైఫ్'లో మీరు హీరోలు కావాలి. అదే నాకు చాలా ఇష్టం. మహమ్మద్ ప్రవక్తకుగాని, జీసస్‌కుగాని ఇంతటి మంచిపేరు ఎట్లా వచ్చింది? మంచి పనులు చేయడంవల్లనే కదా! Greatness (గొప్పతనం)తోపాటు Goodness (మంచితనం)కూడా ఉండాలి. భారతదేశమునందు ఎందరో మహనీయులు జన్మించారు. 'ఎందరో మహానుభావులు అందరికీ వందనములు', అన్నాడు త్యాగరాజు. ఆయన గొప్ప విద్వాంసుడైనప్పటికీ ఎంతో వినయవిధేయతలతో ప్రవర్తించాడు.

**త్యాగమే యోగము, భోగమే రోగము**

ఈనాడు ముఖ్యంగా మనం పోషించుకోవలసింది శాంతగుణము. లోకములో ఎక్కడా శాంతి లేదు. అందరూ I want peace (నాకు శాంతి కావాలి) అంటున్నారు. ఎక్కడుంది Peace? అంతా Pieces! హృదయాన్నే Piecesగా మార్చుకుంటున్నారు. అలాంటివారికింక Peace ఎక్కడినుండి వస్తుంది? మీకు Peace కావాలంటే భగవంతుణ్ణి విశ్వసించండి, ప్రేమించండి. భగవంతునికి మీ జీవితాన్ని అంకితం చేయండి. భగవత్కార్యములలో పాల్గొనండి. ఇతరులకు ఉపకారం చేస్తూ రండి. మీరు ఎప్పుడూ బాగుండాలంటే ఇతరుల మంచిని కోరుకోవాలి. అందరి క్షేమాన్ని ఆశించాలి. ఇదియే నిజమైన సాధన. ఆధ్యాత్మిక మంటే పూజలు, భజనలు చేయడం కాదు. సద్గుణములను పెంచుకోవాలి. పదిమందిచేత మంచివారనిపించుకోవాలి. జీసస్ సత్కీర్తిని సాధించాడు. తన దేహాన్నికూడా త్యాగం చేశాడు. అలాంటి త్యాగానికి మీరు సిద్ధంగా ఉండాలి. త్యాగమే యోగము, భోగమే రోగము. కనుక, మనం భోగమనే రోగానికి బలి కాకూడదు; త్యాగమనే యోగానికి అంకితం కావాలి.

**ప్రేమతో హృదయాన్ని పరిశుద్ధం చేసుకోండి**

విద్యార్థులారా! ఈనాడు అందరూ నేర్చుకోవలసింది, ముఖ్యమైనది ప్రేమతత్త్వమే. మీలో ప్రేమ ఉంటే మిమ్మల్ని ఎవ్వరూ ద్వేషించరు; అడవిలోకి పోతే అక్కడ క్రూరమృగాలుకూడా మిమ్మల్ని బాధించవు. పూర్వం మహర్షులు కారడవులలో క్రూరమృగాలమధ్య నిర్భయంగా, ప్రశాంతంగా కాలం గడుపుతూ వచ్చారు. కారణమేమిటి? వాళ్ళు ప్రేమాస్త్రమును తమ దగ్గర పెట్టుకోవడంచేత క్రూరమృగాలుకూడా వాళ్ళను ప్రేమిస్తూ వచ్చాయి. మీలో ప్రేమ ఉన్నప్పుడు అందరూ మిమ్మల్ని ప్రేమిస్తారు. మిమ్మల్ని రక్షించేవి ఆటంబాంబు, హైడ్రోజను బాంబులు కావు. ప్రేమాస్త్రమే ప్రధానమైనది. దానిని మీరు సంపాదించుకున్నప్పుడు ఎవ్వరూ ఏవిధంగాను మిమ్మల్ని బాధించ లేరు. నాకు ప్రేమయే ప్రధానమైన అస్త్రము. నావద్ద ప్రేమ ఉండడంచేతనే ఇంతమంది ప్రజలు ఇక్కడికి వస్తున్నారు. ఎవరికైనా నేను "ఇన్విటేషన్" పంపించానా? లేదే! నా ప్రేమయే మిమ్మల్ని ఇక్కడికి ఆకర్షించింది. నా హృదయమే ఒక పెద్ద 'మ్యాగ్నెట్'. ఆ 'మ్యాగ్నెట్'వల్లనే 'ఇనుపతుండ్లన్నీ' ఇక్కడికి ఆకర్షింపబడుతున్నాయి. కఠినమైన హృదయాలే ఇనుపతుండ్లు. అవి పరిశుద్ధంగా ఉంటే అతి త్వరగా ఆకర్షింపబడతాయి. "స్వామి నిజంగా 'మ్యాగ్నెట్' అయితే మమ్మల్ని ఎందుకు ఆకర్షించలేక పోతున్నారు?" అని కొందరు అనుకుంటారు. ఆ 'ఇనుపతుండ్ల'కి త్రుప్పు పట్టింది. ఆ త్రుప్పును వదుల్చుకోకుండా అయస్కాంతము ఆకర్షించ లేదంటే, ఎట్లా ఆకర్షిస్తుంది? ముందు ఆ త్రుప్పును వదుల్చుకోండి. ఆ rust & dust పోవాలంటే మీ హృదయాన్ని ప్రేమచేత తోమాలి, పవిత్రం చేసుకోవాలి. ఈనాడు స్వదేశీయులుగాని, విదేశీయులుగాని నేర్చుకో వలసింది ఇదే! Love is selflessness, self is lovelessness. నిస్వార్థప్రేమను అభివృద్ధిపరచుకున్నప్పుడు మీరు ప్రపంచాన్నంతటినీ ఆకర్షించవచ్చు. కనుక, ప్రేమతో జీవించండి.

*(తేది: 25.12.2002 సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశమునుండి)*